## ప్రమదావనం


**ఈ రోజు** మా ఇంట్లో ఒక వార్షికోత్సవం.

ఇంటి ఆడవాళ్ళంతా హడావుడిగా తిరుగుతున్నారు, సాయంత్రం సినిమా ప్లాను గురించి. నా భార్య ఇందిర, వదిన రజనీ చీరల ఎన్నికలో ఉన్నారు. చెల్లెళ్ళు సుందరీ, నిరుపమా జీన్సుమీద కుర్తాల సెలెక్షనులో ఉన్నారు. ఇందిర చెల్లెలు శ్యామల వచ్చింది. ఈ వూళ్ళోనే వాళ్ళ అత్తవారి ఇంట్లో దిగింది. తనూ, అమ్మా కూడా వస్తున్నారు సినిమాకు. నా బాధంతా ఏమిటంటే, వీళ్ళందరికీ ఏకైక మగతోడుగా నేను సినిమా వెళ్ళవలసి రావడం (అయిదుగు రమ్మాయిలను సినిమాకు తీసుకు వెళ్ళడం కన్నా కాన్సెన్‌ట్రేషన్ కాంపు నయమని అన్నయ్య అంటూంటాడు.)

చీరల తరవాత ఉంటుంది అసలు ఎన్నిక—ముక్కు పుడకలది. నలుగురు ఆడవాళ్ళు నగలన్నిటినీ కలబోసి మార్చి మార్చి పెట్టుకుంటూంటే నా కదేమిటో ప్రతిదీ కొత్తగానే కనిపిస్తుంది (ఇదివరకు అన్నీ చూసినట్టే ఉన్నాయనుకునేవాడిని. ఒక సారి అదే మా మహిళా ప్రపంచం చెవుల పడేలా పైకి అనే

# ఇంటింటి విప్లవం

రాధ్రి



శాను. ఆ తరవాతే అన్నీ కొత్తగా కనపడ్డం మొదలు పెట్టాయి.)

ముక్కు పుడకలని ప్రత్యేకించి చెబుతున్నాను. గమనించారా? అదే వార్షికోత్సవం. నీరూ పుట్టిన రోజు. మా స్త్రీ లోకం అంతా కలిసి కట్టుగా వెళ్ళి ముక్కు కుట్టించుకున్న రోజు ఏనివర్సరీ. వింతగా ఉందా? వినండి. ఈ వార్షికోత్సవం మా ఆడవాళ్ళ పట్టుదలకు (మొండితనానికి. కాని, అలా అనరాదు), వ్యక్తిత్వానికి, ఫాషన్ సెన్సుకు, విప్లవానికి నిదర్శనం. ఈ రోజు వెనకాల బోలెడు కథ ఉంది. తీవ్రమైన కాంక్ష, నిరీక్షణ, పెద్దల్ని ఎదిరించడానికి కావలసిన గుండె ధైర్యం ఉన్నాయి. ఈ కథకు హీరోయిన్ నిరుపమ.

అందరిలోకీ చిన్నది కదా అని అతి గారాబంగా చూసుకుంటాం నీరూను, మేమంతా. చిన్నప్పుడు బొమ్మలూ, చాకలెట్లూ, ఫ్రాకులూ, రిబ్బన్లూ, పట్టు పరికిణీలూ, జోళ్ళూ, జీన్సు అడగడం తరవాయి అమిరిపోయేవి (ఇద్దరు చెల్లెళ్ళే అనుకుంటే వదినా, ఇందిరా జతపడ్డాక కొత్త రకం నగలూ, చీరలూ, ఫాన్సీ వస్తువులూ—వీళ్ళు కొనకపోతే నగరంలో షాపులు దివాలా తీస్తాయన్నట్టు ఉంటూంది వరస!)

అయిదేళ్ళ క్రితం మొదలయింది— మొదటి ముక్కుపుడక మహా యుద్ధం. నీరూ అమాంతం ఒక రోజు—''అమ్మా! నేను ముక్కుపుడక పెట్టు కుంటాను'' అని ఒక స్టేట్‌మెంట్ పారేసింది. ''సరే'' అంది అమ్మ. అమ్మా, నీరూ, సుందీ, వదినా కలిసి నగల కొట్టుకు వెళ్ళారు. తీరా అక్కడికి వెళ్ళాక తెలిసింది—నీరూ ముక్కు కుట్టించుకుంటానంది, అమ్మ ప్రెస్ ముక్కుపుడక అనుకుంది—అని.

షాపతను నీరూను బలపరిచాడు— 'కంసాలి ఉన్నాడు. మంచి రోజు—ముక్కు కుట్టించనీయండి' అని. సుంది నిష్పక్షపాతంగా 'దానికి కావాలంటే కుట్టించుకోనీ, అమ్మా' అంది. అమ్మ ససేమిరా వీల్లేదంది. వదిన మొహమాట పడి, 'నెప్పి చేస్తుంది. పెట్టడు ముక్కుపుడక కొనుక్కో, నీరూ' అంది.

నీరూ తన సహజ ధోరణిలో ఏడుపు మొదలు పెట్టింది. అమ్మ విసుక్కుని, ఇంట్లోనే చెప్పి ఉండ రాదూ అని సుంది మీదా, వదిన మీదా విరుచుకు పడి, ఈ రభసకు షాపతను ఏం గొడవ చేస్తాడో అని అతణ్ణి మంచి చేసుకుందుకు వదిన కో కెంపు ఉంగరం కొంది. వదిన నొచ్చుకుంది—''చిన్న పిల్ల. దానికి కొంటామని బయ ల్దేరి నాకు కొన్నారు. నీరూ ఏమనుకుంటుంది?'' అని. ''ఫర్వాలేదు. నీ కూతురి కుంటుంది'' అంది అమ్మ. వదిన కప్పుడు అయిదవ నెల.

నీరూ వదిన ఉంగరం వూసైనా ఎత్తలేదు. అందర్నీ సణిగి, షాపునుంచి బయటపడి ఇల్లు చేరే దాకా ఏడుపు సాగించింది.

ఇంట్లో మూడవ ప్రపంచ యుద్ధం మొద లయింది.

''పధ్నాలుగేళ్ళది. దానికేం తెలుసు? స్కూల్లో ఎవర్నో చూసి ఇదీ ముక్కు కుట్టించుకోవడమేనా? ఏదో సామెత చెప్పినట్టుంది.'' అమ్మ.

''ముక్కుపుడక పెట్టుకోవడంలో తప్పేమిటి?'' నీరూ ప్రశ్న.

''మన ఇంట్లో ఎవరికీ లేదు. ఇప్పు డెందుకు?'' అమ్మ సాధింపు.

''నా ముక్కు, నా ఇష్టం.'' నీరూ పంతం.

''నెప్పెడుతుంది. ఇలాంటివి చిన్నప్పుడైతే తెలియదు. చర్మం ముదిరిన కొద్దీ నెప్పి ఎక్కువ.'' అమ్మ బెదిరింపు.

''ఐస్ ముక్క ఉంటే చాలు—కలకాలం నెప్పి పెట్టదు.'' నీరూ ధీమా.

''ఉత్త పల్లెటూరి వేషం.'' అమ్మ.

''నీకేం తెలుసు? ఇంకొన్నాళ్ళలో ఇదే ఫాషనవు తుంది.'' నీరూ.

'చిన్న పిల్లవి, ఒకసారి కుట్టించుకున్నాక బాగు లేదనిపిస్తే తీసేస్తావు. ఆ సంగతి నాకు తెలియదూ?' నీరూ వీక్ పాయింట్ మీద దెబ్బ తీసింది అమ్మ.

చివరికి అమ్మ చెప్పింది—పెళ్ళయిన కొత్తలో తన ఆడపడుచూ, తనూ కుట్టించుకున్నారట. ఆడ పడుచుకు సెప్టిక్ అయి, కాయలాగా కాసి, పెర్మ నెంట్‌గా మచ్చ ఉండిపోయిందట. అమ్మ భయపడి తీసేసిందట. నీరూ అందాల మొహంలో అలాంటి దేదైనా వూహించుకోలేకపోయాము, ఎవ్వరమూ కూడా. కాని, నీరూ తన వాదన మార్చుకోలేదు. ఒక్కొక్కళ్ళ దేహ తత్వాన్ని బట్టి ఉంటుంది, అంది. అమ్మ 'వయసు వచ్చాక తరవాత తప్పనిసరిగ కాంప్లికేషన్సు వచ్చి తీరతాయి' అంది.

చివరికి నాన్నగారు రంగప్రవేశం చేసి, వాదోపవాదాలు విని, అమ్మే రైటని నిర్ణయించారు. నీరూ వారం రోజులు ఎవ్వరితోనూ, నెల్లాళ్ళు నాన్నగారి తోనూ, రెండు నెలలు అమ్మతోనూ మాట్లాడ లేదు.

రెండవ ముక్కు పుడక మహాయుద్ధంలో నీరూ చాలా తెలివిగా దాడి చేసింది. నీరూ పదిహేనవ పుట్టిన రోజు. అన్నయ్య దానికి హెయిర్ డ్రయర్ కొని పెట్టాడు ( జీనత్ అమన్ పొట్టి జుట్టుతో ఉన్న రోజు అవి ). వదిన డెనిమ్ హాండ్‌బాగ్. సుందీ హిల్సు. నేను ఒక సిల్కు షర్టు. అమ్మ ఎప్పటిలా కొత్త బట్టలు. నాన్నగారు కాష్ ఇచ్చి కావలసింది కొనుక్కోమన్నారు. నీరూ ఒంటి రవ్వ ముక్కు పుడక కొనుక్కుంటానంది ( అది పెట్టుకుందుకు ముక్కు కుట్టించుకోవాలి, మరి ).

అమ్మ పుట్టిన రోజు, చిన్న పిల్ల వగైరా అన్నిటినీ తోసి పుచ్చి, పిల్లేదంది. నీరూ పుట్టినరోజు పండగ మంచం మీద పడుకుని తలగడ తడిపేస్తూ జరుపుకుంది. అంతేకాని, తన కోరిక ఉపసంహరించుకోలేదు.

ఆఖరికి అమ్మ నీరూ ఆశను కాలం మీదికి తోసింది. "నీకు పద్దెనిమిదేళ్ళు నిండాక ఏం చేస్తావో చేసుకో. అంతదాకా నా మాట విని తీరాలి నువ్వు" అని యుద్ధ విరమణ చేసింది. నీరూ నైజం తెలుసు కాబట్టి ఈ ఎత్తు వేసింది అమ్మ, ముక్కు పుడక మోజు మరిచిపోతుందన్న ధీమాతో.

కాని, పోయిన ఏడు పుట్టిన రోజుకు నీరూ ప్రొద్దుటే కాఫీతో మసాలా జోడించింది—"ముక్కు కుట్టించుకుందుకు వెళుతున్నాను" అని.

అమ్మ నిట్టూర్చింది. 'నీ ఇష్టం' అంది. మాట వెనక్కు తీసుకోలేదు కదా! వదినా, ఇందిరా నొప్పెడుతుందనీ, తీరా బాగుండకపోతే? అనీ నచ్చ చెప్ప చూశారు.

సుంది 'రాగితీగ సూత్రం మట్టించుకోకు. నా మార్వాడీ ఫ్రెండ్ ఒకత్తికి పెర్మనెంటు గాయు అయిపోయింది' అంది తేలికగా. అమ్మ మొహం పాలిపోయింది.

ఇందిర మాట మార్చింది 'నాకూ చాలా సరదాగా ఉంది కాని, భయంగానూ ఉంది' అని.

నొప్పి, ముక్కు వాచడం అదీ ఒక ఎత్తు. ఫాషను ఒక ఎత్తు. అప్పటికే ముక్కుపుడక ఫాషను బాగా ప్రచారం లోకి వచ్చేసింది. సుందీ, నీరూలకు ఇందిర జతపడ్డాక ఇంట్లో రోజూ ఫాషన్ పెరేడే కదా!

అమ్మ తరఫున వదిన—'ఆలోచించుకో, నీరూ. సరదా తీరిపోయాక వద్దనుకుంటే లాభం లేదు' అంది.

నీరూ ఈసారి యుని ఇట్టే ఎగర గొట్టేసింది— 'తీసేస్తే అదే మూసుకు పోతుంది' అని. ఇంక ఎవరూ ఎదురు చెప్పలేదు.

నీరూ బయులుదేరే ప్రయత్నం మొదలుపెట్టింది. అమ్మకు అసలు ఏమా కేదైనా నొప్పెడుతుందంటేనే చెమటలు పోస్తాయి. నీరూ ముక్కు కుట్టించుకునే లోపల అమ్మ మూడు సార్లు మూర్ఛపోయింది. అందుచేత 'దాని కెవరన్నా సాయం వెళ్ళండి' అంది, తన కేమీ పట్టనట్టుగా.

వదిన రాలేనంది. ఇందిర అయిష్టంగా మొహం పెట్టింది. సుందీ తనకు ఓపికగా లేదంది. నీరూ చిన్నబుచ్చుకుంది. చివరికి నేను తయారయ్యాను. 'నేను వస్తాను, పద' అన్నాను.


షాపులో కూరగాయలు కొన్నట్టు కొంటున్నారు నగలు. ఎంతమంది ఆడవాళ్ళో! వాళ్ళనూ, వాళ్ళ పర్సుల్లోంచి తీసే నోట్ల కట్టలనూ చూస్తే దేశంలో దారిద్ర్యం ఎక్కడ ఉందో వెతకాలనిపిస్తుంది నాకు. అంతా మధ్య తరగతి ఆడవాళ్ళే.

ఒక కౌంటరు దగ్గరికి వెళ్ళి ముక్కు కుట్టించుకోవాలంది నీరూ. కంసాలి వచ్చాడు. రింగు లాంటిది కావాలా? బంగారు గుండుసూది లాంటి కాడ కావాలా? ప్రశ్న ఎదురయింది.

రింగు లాంటిది మొహం కడుక్కునేటప్పుడూ, మొహం మీద చెయ్యి పడినప్పుడూ ప్రాణం


**మీకుపయోగించేది**

ఇంట్లో ఎవరికే రోగం వచ్చినా కంగారు పడే పనిలేదు. ఐదురకాల ప్రఖ్యాత వైద్యులు ప్రతిరోగానికి, రోగలక్షణాలు, వాటి నివారణకు ఇంగ్లీషు, ఆయుర్వేద, ప్రకృతి, మూలిక, హోమియో మందులు, "ఐదు వైద్య విధానాలు" అనే తెలుగు పుస్తకంలో అందరికీ తెలిసేలా వ్రాశారు. అన్ని షాపుల్లో దొరికే మందులే. 427 రోగాలు నయము చేసుకొనే మార్గాలున్నాయి. వెల రూ. 16. పోస్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణాలు, 5/3 ఆర్.టి. పంజాగుట్ట కాలని, హైదరాబాదు-4 కు, మీకో పుస్తకం వి.పి. పోస్టులో పంపుమని వెంటనే వ్రాయండి.

జిలార్చుకు పోతుంది. గుండుసూదే నయమన్నాడు కంసాలి. ఆ కంసాలిని చూస్తుంటే నాకు భయం వేసింది. చేతిలో ఒక పటకారా అతడూ. నీరూ ధైర్యం చూస్తే ఆశ్చర్యంగా ఉంది.

అచ్చం ఒకేలా ఉన్న ఆరు తీగల్లో ఒకటి ఎంచుకుందుకు నీరూకు అర గంట పట్టింది. అన్నీ ఒక్కలాగే ఉన్నాయి కదా అనబోతే—"ఒక్కొక్క దానికి ఎఫెక్టు ఉంటుంది. కొన్ని మనకు పడక పోవచ్చు" అంది (బోడి నమ్మకం. అయిదు నిమిషాల సేపు ఒకబంగారు గుండుసూదిని పట్టుకు కూర్చుంటే దాని ప్రభావం మంచో చెడో ఏం తెలుస్తుందో నా కర్థం కాలేదు).

తరవాత లోపలికి వెళ్ళాం. పెద్ద గదిలో స్పాట్ లైట్ల వెలుతురులో అతి నాజూకు నగలను రూపొందిస్తున్నారు ఆరుగురు. ఒక కిటికీ దగ్గర స్టూలు మీద కూర్చుంది నీరూ. ఒక అద్దం చేతి కిచ్చి పెన్ను తీశాడు కంసాలి. 'ఏ వైపు?'' అనడిగాడు. నా కర్థం కాలేదు. నీరూ 'కుడివైపు' అంది. 'ఎడం వైపు బాంబే స్టైల్లో కుట్టించుకో'మని కంసాలి సలహా. 'వద్దు. మన వైపు లాగే కావా'లంది నీరూ.

ఆ పైన పెన్నుతో ముక్కుమీద చిన్న చుక్క పెట్టాడు. 'చూసుకోండి' అన్నాడు. ఆ చుక్క ఉన్న చోట గుండుసూది తలను వూహించుకోవాలి కాబోలు. నాకు అర చేతుల్లో చెమటలు పట్టసాగాయి.

"ఏరా?'' అంది నీరూ. 'బాగానే ఉంది' అన్నాను. 'కొంచెం వెనక్కు ఉంటే?' ఆ చుక్క చెరిపి వేరొకటి పెట్టింది నీరూ. 'లేదమ్మా. లోపల సీలకు ఎడం చాలదు.' కంసాలికి తన చుక్కే బాగున్నట్టుంది. అయిదు నిమిషాలు చుక్కలు పెట్టీ, చెరిపీ, చివరికి ఆ సిరా అంతా కడుక్కుందుకు నీళ్ళు తెప్పించి, కంసాలి పెట్టిన చుక్కే సరిగ్గా ఉందని ఒప్పుకుంది నీరూ. ఆ పాటికి నాకు కాళ్ళు వణుకుతున్నాయి. లేని కుతూహలంతో మిగతా కంసాలుల పని చూస్తున్నాను.

కంసాలి ఆ గుండుసూది మొనను పదును పెడుతున్నాడు. 'ఏనస్థెంటిక్ ఇస్తారా?' అని అడిగాను. కంసాలి వేదాంతిలా నవ్వాడు. ఏంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్‌లో ముంచి తీసి, 'ఇది చాలు, సార్' అని నీరూ వైపు తిరిగాడు. నీరూ కేసి చూడడానికి ధైర్యం చాలలేదు నాకు.

నీరూ స్టూలు అంచులను పట్టుకుని కూర్చుంది. ఒక చేత్తో నీరూ ముక్కును పట్టుకుని, రెండవ చేత్తో సిరా చుక్క మీదికి...

నేను మళ్ళీ కళ్ళు తెరిచేసరికి నీరూ నా మొహం లోకి చూస్తూ నవ్వుతూంది. కళ్ళ వెంట నీళ్ళు. నిెరవి ముక్కు. కుడివైపు బంగారపు చుక్క.

"నెప్పెట్టిందా?'' అన్నాను. కింద పడ్డప్పుడ మోకాలు మడతపడి నాకు నెప్పెడుతూంది 'లేదురా, చీమ కుట్టినట్టుంది. అంతే' అంది నీరూ.

రోజూ కొబ్బరి నూనె పెట్టమనీ, రెండు వారాల్లో తీసేసి ముక్కుపుడక పెట్టుకొమ్మనీ సలహా ఇచ్చాడు కంసాలి. అతనికి పది రూపాయలు ఇచ్చి, బిల్లు సెటిల్ చేసి బయట పడ్డాం.

నీరూకు ఐస్‌క్రీమ్ పెట్టించి, నా పిరికితనం ఇంట్లో చెప్పవద్దని ఒట్టేయించుకుని, ఇంటి మొహం పట్టాం.

ఇంట్లో అది స్వర్ణ యుగారంభం. నీరూ ముక్కు అందాన్ని చూసి ముచ్చట పడిపోయా రంతా. ఇందిర 'మీరు పరేనంటే' అని మర్యాదకు ఒక మాట అనేసి తనూ కుట్టించుకుంటానంది. సుందీ —'నిజం చెప్పు — నెప్పెట్టిందా?' అని క్రాస్ ఎగ్జామినేషన: మొదలు పెట్టింది. ఆశగా చూసి వూరుకుంది, మా అన్నయ్య పెర్మిషన్ లేనిదే వూపిరైనా పీల్చని మా వదిన (అన్నయ్య స్టేట్స్‌లో ఉన్నాడు).

సాయంత్రానికి ఇంట్లో మగాడు ముక్కులకు పొగడ్తలు వెదుక్కోవలసి వచ్చింది. అమ్మ భయం తగ్గి, రవ్వల ముక్కు పుడకలూ, ముత్యంవీ అవీ చర్చించ సాగింది. నాన్నగారు 'బార్బేరియన్!' అన్నారు—అంతే.

అయిదు రోజుల తరవాత శ్యామల వూళ్ళోకి వచ్చింది. వాళ్ళ అత్తారి ఇంట్లో దిగింది. వీళ్ళను చూసి ముక్కుపుడకల వెర్రి ఆవేశించి తనూ చేరి పోయింది ముక్కుపుడకల పార్టీలో. వాళ్ళ అత్తగారు మురిసిపోయి తన ఏడు రాళ్ళ ముక్కుపుడక ఇచ్చేసింది, ముక్కు ఆరాక పెట్టుకుందుకని. నెల్లాళ్ళలో అన్నయ్యకు వ్రాసి, పెర్మిషన్ తెప్పించుకొని, వదినా కుట్టించుకుంది ముక్కు.

ఇంతదాకా బాగుంది. విషాదఘట్టం ఇక్కడితో మొదలయింది. కంసాలి రెండు వారాలన్నది నెల్లాళ్ళు ఉంచుకున్నారట. నీరూ ముక్కు బాగానే ఉంది కాని, సుందీ ముక్కు లోపల పుండు కాసాగింది. అమ్మ—'నే చెప్పాగా?' అని సాగించింది.

గుండుసూది తీసేసి వేప పుల్లా, కొబ్బరిపుల్లా పెట్టి సతమతం కాసాగింది సుందీ. ఇకపైనకూడా ముక్కు వాచడంతో డాక్టరు దగ్గరికి వెళ్ళింది. ఆయన ఎసెప్టిక్ కండిషన్సులో కుట్టించుకుంటే ఇంతే అని, పుల్ల తీసేసి, తనిచ్చిన మందులు వాడమనీ, ఈ కన్నం మూసుకుపోయాక మళ్ళా తను సర్జికల్‌గా కుట్టిపెడతాననీ అన్నాడు.

నా కసలు నెప్పెట్టలేదు అంటే, నాకూ నెప్పి తోచలేదని కబుర్లు చెప్పిన వీళ్ళలో నిజం పాళ్ళు తేలిపోయాయి. సుందీ మళ్ళా కుట్టించుకునే ధైర్యం లేక ఫీలలేకుండా ముక్కు పుడక ఒకదాన్ని పెట్టుకునే డాక్టరు మందులు వాడసాగింది.

దానికితోడు అమ్మవారికి వెండి ముక్కు చేయిస్తానని మొక్కుకుంది. తను కుట్టించుకున్న గుండుసూదీ ఇచ్చేస్తానని ఇంకో లంచం పెట్టింది. మందులో, అమ్మవారి కరుణో ముక్కు శుభ్రంగా ఆరిపోయి మచ్చ లేకుండా బాగయిపోయింది.

దానితో ధైర్యం వచ్చి నీరూ బయట పడింది. తన ముక్కులోపల ట్రబులే. పైకిఅంటే అమ్మ 'నే చెప్పాగా' అంటుందని తేలు కుట్టిన దొంగలా వూరుకుంది. తరవాత వదిన కూడా ఎందుకన్నా మంచిది అని సాకు చెప్పి తనూ మందులు వాడసాగింది.

ఇందిర లక్కీ. రెండు నెలల తరవాత గుండుసూదిని తీసేసి మూడు రవ్వల ముక్కుపుడకకు గ్రాడ్యుయేట్ అయింది. ఈ గొడవంతా శ్యామలకు వ్రాసిందట. శ్యామల 'నా ముక్కు బాగానే ఉందే' అని ఆశ్చర్యపడిపోయి, తన గుండుసూదిని తిప్పీ, కదిపీ మొగుడుకి చూపించిందట. వారం రోజుల్లో ఏం మందులు వాడుతున్నారని ఉత్తరం వచ్చింది ఇందిరకు.

సుందీ పద్ధతిలో అందరూ అమ్మవారికి మొక్కుకున్నారు. ఆరు నెలల్లో అమ్మ వారికి ఆదాయం బోలెడం తయింది. అందరూ తమ తమ ముక్కులతో, ముక్కుపుడకలతో తృప్తిపడ్డారు.

ఆ తరవాత గ్రూప్ ఫోటో సీన్‌లా అంతా సరదాగా వెర్రిగా ముక్కు పుడకలు కొంటూ సుఖంగా కాలం గడిపారు. ఎక్కడికి వెళ్ళినా ఎవరెవరి ముక్కు పుడకలూ పరిశీలించడం, అయ్యో! ఎడంవైపు కుట్టించుకుని ఉండవలసిందే! అని వాపోవడం, ఏ సినిమా తార ఎలాంటి ముక్కుపుడక పెట్టుకుందని గమనించడం...

నీరూ పుట్టినరోజు—ఈ రోజు ముక్కుపుడకల వార్షికోత్సవం. ఈ ఆడమందను సినిమాకు తీసుకు వెళ్ళి తీసుకురావడం నా మీద పడింది. నలుగురు

---

## వ్యసనం

స్వయంకృతాపరాధానికి మరో పేరు వ్యసనం.

—స్వామిరామ తీర

---

అందమైన అమ్మాయిల్నీ, వదిన లాంటి మహిళనూ, వదిన కూతుర్లాంటి బేబీని తీసుకువెళ్ళడంవ ల్లే. కానీ, హాల్లోనూ, రోడ్డు మీదా అందరి చూపులూ వీళ్ళమీదే నని నా బెంగ.

నిజానికి ఆత్మ రక్షణ వీళ్ళకు వెన్నతో పెట్టిన విద్య. చాలాసార్లు నీరూ, సుందీ సినిమా మధ్యలో పక్కసీటువాణ్ణో, వెనకసీటువాణ్ణో గట్టిగా కసరడం, లెంపకాయ కొట్టడం, హాలంతా గోల చెయ్యడం, రోడ్డు మీద, షాపుల్లో, బస్సుల్లో 'ఆత్మరక్షణ' చేసుకోవడం నాకు తెలుసు (మొదట్లో వాళ్ళకూడా మగ దిక్కును నేను ఉండగా వాళ్ళిలా ఆత్మరక్షణ స్వయానా చేసుకోవటం అవమానంగా తోచేది. కాని, ఒకసారి ఒక బ్రూస్‌లీ నా కాలరు పట్టుకుని, 'ఏరా! ఆడపిల్లల చేత నన్ను అల్లరి పెట్టించి చూస్తూ వూరుకుంటావా?' అని కుదిపెయ్యబోతూంటే — 'క్షమించాలి. వాళ్ళెవరో నాకు తెలియదు —'అని చెప్పి బయట పడ్డాను నేను).

సినిమా అయి, ఇంట్లో భోజనాల వరకూ చర్చ—సినిమా మీద, హాల్లోని జనం మీద. తరవాత నీరూ అలవాటు ప్రకారం ఒక బాంబు పేల్చింది.

చెవులకు ఇంకో మూడు కుట్లు వేయించుకోవడం ఇప్పుడు లేటెస్టు ఫాషనుట! విష్లవం వర్ధిల్లాలి! ★

**( అంకితం: త్రివేణి ముక్కుకు )**